క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన మొలుగూరి నర్సయ్య ఇటీవల వ్యవసాయ విద్యుత్ మోటారు వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందాడు. నర్సయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడిన నర్సయ్య కుటుంబానికి శనివారం గ్రామానికి చెందిన కొందరు సుమారు రూ.50 వేల విరాళాలు సేకరించి మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో పోలంపల్లి వెంకటేశ్వర్లు, కాసాని శ్రీనివాసరావు, నందిగామ సైదులు, గజగంటి శ్యాంకుమార్, రామిని విజయవర్ధన్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మర వాగు ఆక్రమణలు తొలగించాలని వినతి

కోదాడ : కోదాడ పెద్దచెరువు అలుగు నీరు ప్రవహించే తమ్మర వాగు ఖమ్మం రోడ్డు, తమ్మర వంతెన సమీపంలో ఆక్రమణకు గురైందని, దీంతో వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు ఇళ్లమీదకు వస్తోందని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని లక్ష్మీపురానికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ బషీరుద్దీన్ కోరారు. ఈమేరకు శనివారం కోదాడ నీటిపారుదల శాఖ ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ వాగు ఆక్రమణతో గత సంవత్సరం సెప్టెంబర్ 1న, ఇటీవల వచ్చిన వరదలకు షిర్డీసాయినగర్ కాలనీ ముంపునకు గురైందని తెలిపారు. ఆక్రమణలు తొలగించి వరదనీరు దిగువకు సాఫీగా వెళ్లేలా చూడాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ వైద్యశాల సహకారంతో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన వైద్యశిబిరాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టికూటి నాగయ్య, డాక్టర్లు ఉపేందర్‌సింగ్, నజీర్, నిశాంత్, నిఖిత, నాయకులు వీరారెడ్డి, వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు, సాయి, నవీన్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

మేళ్లచెరువు : చింతలపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.68 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, శంకరాచారి, మార్తాల సీతారెడ్డి, హుస్సేన్, తోట అంజయ్య, మతీన్, గోనె అంకయ్య, బీమిశెట్టి పద్మ, వెంకటరెడ్డి, కార్తీక్ యాదవ్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

మోతె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష నిధులు రూ.8 లక్షల వ్యయంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఈడబ్ల్యూఐడీసీ ఏఈ ఓబులేస్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పులి ఈదయ్యగౌడ్, మామిడి వెంకటేశ్వర్లు, గుండ్ల లక్ష్మారెడ్డి, కాంట్రాక్టర్ చెర్వుపల్లి యల్లయ్య, దోసపాటి చిరంజీవి, గడ్డం రాంరెడ్డి, సామ రాంరెడ్డి, బొడ్డు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజసేవ చేయాలి



పిచ్చిమొక్కల నివారణకు కలుపుమందు పిచికారీ చేయిస్తున్న వెంకటేశ్వర్లు

మునగాల : యువత సమాజసేవ చేసేందుకు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని తాడువాయిలో గల శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో పిచ్చి మొక్కల నివారణకు శనివారం వెంకటేశ్వర్లు తన సొంత ఖర్చుతో కలుపుమందు పిచికారీ చేయించారు. గ్రామంలో దోమలబెడద ఎక్కువై ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని, దీంతో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు వారణాసి సత్యనారాయణశాస్త్రి, యువత కోట అలీబాబా, కొలిశెట్టి నాగరాజు, లొడంగి మహేష్, జిల్లేపల్లి వినయ్, వీరబాబు, శ్రీను, వీరయ్య, వెంకన్న, లడ్డు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అలుగు పోస్తే.. రాకపోకలు కష్టమే

- వర్షాకాలంలో రోడ్డుపైకి నడిగూడెం ఊరచెరువు వరద నీరు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు
- బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు



కలకోవ-నడిగూడెం గ్రామాల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

మునగాల : మండలంలోని కలకోవ నుంచి నడిగూడెం మండల కేంద్రం మధ్యలో రోడ్డుపై వర్షాకాలంలో నడిగూడెం ఊరచెరువు అలుగు నుంచి వచ్చే వరదనీరు పారుతుండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూడా చెరువు అలుగు పోస్తుండడంతో రోడ్డుపై నుంచి వెళ్తోంది. ముఖ్యంగా మండలంలోని కలకోవ, జగన్నాధపురం, విజయరాఘవపురం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఖమ్మం పట్టణానికి ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. వీరికి తిప్పలు తప్పడం లేదు. భారీ వర్షాలు పడినప్పుడు రెండు గ్రామాల మధ్య రాకపోకలకు బంద్ అవుతున్నాయి. కొందరు ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ వరద గుండా ప్రయాణిస్తున్నారు. కలకోవ నుంచి నడిగూడెం వరకు సుమారు మూడు కి.మీ. మేర తారు రోడ్డును పదేళ్ల క్రితం నిర్మించారు. కానీ నడిగూడెం ఊరచెరువు అలుగునీరు పారే చోట బ్రిడ్జి నిర్మించడం మాత్రం మరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నడిగూడెం-కలకోవ గ్రామా ల మధ్య గల రహదారిపై బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



నడిగూడెం మండల కేంద్రంతో పాటు ఖమ్మం పట్టణానికి మునగాల మండలంలోని మూడు గ్రామాల ప్రజలు కలకోవ – నడిగూడెం రహదారిపై నుంచే ప్రయాణిస్తుంటారు. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు నడిగూడెం ఊరచెరువు నీరు రోడ్డుపై పారుతుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. కావున రెండు గ్రామాల మధ్య తక్షణమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– పాతకొట్ల నాగరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కలకోవ

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం నేరేడుచర్లలోని కోదాడ- జడ్చర్ల ప్రధాన జాతీయ రహదారిపై బీజేపీ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, రమావత్ నర్సినాయక్, పార్థనబోయిన విజయ్, తాళ్లూరి రమేష్, బాల వెంకటేశ్వర్లు, సత్యం, బక్కిరెడ్డి, అశోక్, నారాయణరెడ్డి, శావయ్య, నాగేశ్వర్‌రావు, శంకర్‌రెడ్డి, నాగయ్య, వీరబాబు, నరేందర్‌రెడ్డి, జగతయ్య, ఎల్లయ్య, శేషగిరి, మట్టారెడ్డి, రాము, విమల, కృష్ణవేణి, మధు, రమణాచారి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.

నేడు కోదాడలో సభ

చిలుకూరు : వికలాంగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోదాడలోని ఆర్‌ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబోయే వికలాంగులు, చేనేత పెన్షన్‌దారుల సన్నాహక సభకు వికలాంగులు, చేనేత పెన్షన్‌దారులు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ కోరారు. శనివారం మండలంలోని చెన్నారిగూడెంలో జరిగిన వికలాంగులు, చేనేత పెన్షన్‌దారుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు



మునగాల : తాడువాయి సొసైటీ ఎదుట యూరియా కోసం రైతుల పడిగాపులు



పాలకవీడు పీఏసీఎస్ వద్ద..

మునగాల : మండలంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా దొరకడం లేదు. కోఆపరేటివ్ సొసైటీలకు అడపాదడపా సరఫరా అవుతోంది. దీంతో యూరియా లోడ్ వచ్చినప్పుడు రైతులు ఎగబడుతున్నారు. శనివారం మండలంలోని నాలుగు సొసైటీలకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. తాడువాయి, మునగాల సొసైటీల వద్ద యూరియా కోసం క్యూ కట్టారు.

పాలకవీడులో..

పాలకవీడు : మండలంలో యూరియా సరిపడా అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఉదయం నంచే రైతులు క్యూలైన్‌లో బారులుదీరారు. కాగా, మండలంలోని పీఏసీఎస్‌లలో స్టాక్‌ను బట్టి అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా సరఫరా చేస్తున్నారు. కానీ రెండెకరాలకు పైగా పంట సాగుచేస్తున్న రైతులకు సరిపోవడం లేదు. సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు గోనె విజయ, ఖమ్మంపాటి లక్ష్మమ్మ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది అమరులయ్యారని తెలిపారు. అనేకమంది కేసులకు భయపడకుండా ఉద్యమ సాధనలో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు పుట్టా సోమమ్మ, కార్యదర్శి నోముల ఉమ, పట్టణ అధ్యక్షురాలు బంటు ఎల్లమ్మ, కార్యదర్శి కొమ్మాండ్లపల్లి సుజాత, పట్టణ కమిటీ సభ్యులు మాచర్ల రామలక్ష్మి, సాయని సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్రోత్సవాలు



హుజూర్‌నగర్ : పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి



మఠంపల్లి : చింతలమ్మగూడెంలో..



హుజూర్‌నగర్ : అన్నదానం ప్రారంభిస్తున్న యరగాని నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : పట్టణంలో వినాయక చవితి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వినాయకుని మండపం వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పాత రెడ్డి బజార్‌లో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


గణనాథుడికి పూజలు

మఠంపల్లి : మండలంలో ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. విగ్రహాలు ప్రతిష్ఠించి మూడవరోజు కావడంతో గణేష్ విగ్రహాలను మట్టపల్లి వద్ద గల కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ, మట్టపల్లి దేవస్థానం ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్యను ఎదుర్కొనేలా తయారుకావాలి

హుజూర్‌నగర్ : సమాజంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఎదుర్కొనే విధంగా బాలికలు తయారుకావాలని షీటీం హెడ్ కానిస్టేబుల్ కవిత అన్నారు. శనివారం పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటీ స్కూల్‌లో సమాజంలో బాలికలపై జరిగే అత్యాచారాలు, ఆకృత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం మురుగన్ పెళ్లై, షీటీం కానిస్టేబుళ్లు జ్యోతి, నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో విశేష పూజలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, గర్భాలయంలో శ్రీమూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామ పరిధిలో గల ఎర్రవాగు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవడంతో పాటు ఇటీవల వానలకు ధ్వంసమైన బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పత్తిపాటి విజయ్ కోరారు. ఈమేరకు శనివారం చింతలపాలెం తహసీల్దార్, ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క నెలలో నాలుగుసార్లు ఎర్రవాగు పొంగి గ్రామంలో బ్రిడ్జి మీదుగా వరద ప్రవహించిందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో కాటబోయిన లింగరాజు యాదవ్, బండారు నాగరాజు, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరిస్తాం



చిలుకూరు : రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి



పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మి

చిలుకూరు : పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు రాతపూర్వకంగా తెలియజేస్తే పరిశీలించి పరిష్కరించనున్నట్లు జిల్లా క్రీడల, యువజన విభాగం అధికారి, మండల ప్రత్యేక అధికారి రామ్‌చందర్‌రావు తెలిపారు. శనివారం వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి రాజకీయ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా రాజకీయ నాయకుల నుంచి 5 అభ్యంతరాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, అఖిల పక్ష నాయకులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

పాలకవీడు : త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విడుదల చేసిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. శనివారం ఓటరు జాబితాలపై మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. చనిపోయిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించాలని పలువురు పార్టీల ప్రతినిధులు కోరారు. ఓటరు జాబితా విడుదల చేసిన ఒక్కరోజులోనే అన్ని ఓటర్ల జాబితాలను పరిశీలించడం సాధ్యం కాదని, ఓటర్లలో నెలకొన్న సందేహాలు నివృత్తి కావాలంటే మరో వారం రోజులు గడువు కావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.శంకర్, తహసీల్దార్ కమలాకర్, ఎంపీఓ వీరయ్య, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రతినిధులతో సమావేశం

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు ముసాయిదా జాబితాలపై మండల ప్రత్యేక అధికారి రవినాయక్ అధ్యక్షతన అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలలో అవకతవకలు జరిగాయని, వెంటనే సరిచేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. సమావేశంలో తహసీల్దార్ మంగారాథోడ్, ఎంపీడీఓ వెంకటాచారి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్‌ప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచూసుకోవాలని, డబుల్ ఓట్లు, మృతి చెందిన ఓటర్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండ కవితారెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఏపీఓ సురేష్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేక అధికారి వి.సతీష్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఎల్.మల్సూర్, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేక అధికారి శిరీష ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మోతెలో..

మోతె : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా అభ్యంతరాలపై శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల ప్రత్యేక అధికారి సీతారాంనాయక్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను వివరించారు. ఓటరు ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా గ్రామ స్థాయి, మండల స్థాయి అధికారులకు తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ ఎం.వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి మృతి సీపీఎంకు తీరని లోటు

మేళ్లచెరువు : చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఎరబోలు వెంకటరెడ్డి మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంకటరెడ్డి మృతి సీపీఎంకు తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో వట్టెపు సైదులు, దుగ్గి బ్రహ్మం, హుస్సేన్, శ్రీను, సుందరమోశ్వేరరెడ్డి, జంగాల పుల్లయ్య, భూలక్ష్మి, కోటయ్య, మంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని హెచ్ఎం మురుగన్ పిళ్లై అన్నారు. శనివారం పెరల్ ఇన్ఫినిటీ స్కూల్ లఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు



హుజూర్‌నగర్ : గ్రంథాలయాన్ని పరిశీలించి సూచనలిస్తున్న వంగవీటి రామారావు



గరిడేపల్లి : వంగవీటి రామారావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గరిడేపల్లి : గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గరిడేపల్లిలో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు రూ.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అవసరమైతే జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి అదనంగా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ, గ్రంథాలయ అధికారి విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, సర్వారం సింగిల్ విండో చైర్మన్ పెండెం ముత్యాలుగౌడ్, నాయకులు షేక్ చాంద్‌మియా, సురభి సైదులు, మాజీ సర్పంచ్ మంగళగిరి నాగరాజు, సోమిరెడ్డి రాంరెడ్డి, బండ వెంకటనర్సిరెడ్డి, నిర్వాహకులు పిట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గరిడేపల్లి : సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు కోరారు. శనివారం మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో వంగవీటి రామారావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు గెల్లి సతీష్‌కుమార్, శ్రీరంగం రత్నాకర్, శ్రీరంగం ప్రసాద్, ముచ్చర్ల గోపాలకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

హుజూర్‌నగర్ : గ్రంథాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. హుజూర్‌నగర్‌లో రూ.88 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను శనివారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని హంగులతో గ్రంథాలయ భవనం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, గ్రంథాలయ అధికారి కంచర్ల శ్రీధర్‌రెడ్డి, కె.మధు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పాలకవీడు : విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న ఎంఈఓ కాటయ్య

పాలకవీడు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ ఇంజమూరి కాటయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్ 14- 17 విభాగాల మండల స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్‌ను ఎంఈఓ అందజేసి మాట్లాడారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు డివిజన్, జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి కబడ్డీ పోటీలు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి బహుమతులు అందించారు. ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఎల్. శ్రీనివాస్‌రావు, టి.రవీందర్‌రెడ్డి, యాదగిరి, ఏసుపాదం, శ్రీనివాస్, భాస్కర్, అశోక్, ప్రియదర్శిని, అరుణ, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, గోపయ్య, కోటిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అనంతగిరి : మండలంలోని శాంతినగర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ అండర్- 14, 17 క్రీడా పోటీలను మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలలో ప్రతిభచూపిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాంతినగర్ హెచ్ఎం పురుషోత్తం, పీడీలు గోవిందరెడ్డి, శ్రీధర్, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణం ఇక సాఫీగా..



నడిగూడెం-మందడినర్సయ్యగూడెం మధ్య కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు

నడిగూడెం : నడిగూడెం నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడి నర్సయ్యగూడెం వెళ్లే రోడ్డుకు మహర్దశ పట్టింది. డబుల్ రోడ్డుగా మారుతోంది. పనులు కూడా చకచకా జరుగుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ నుంచి మంజూరైన రూ.20 కోట్ల వ్యయంతో నడిగూడెం మండలం నారాయణపురం క్రాస్ రోడ్డు, కరివిరాల క్రాస్ రోడ్డు, కాగితరామచంద్రాపురం గ్రామం మీదుగా మందడి నర్సయ్యగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటికే మెటల్ పనులు పూర్తయి బీటీ పనులు చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఖమ్మం రాకపోకలకు మండల ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. దీంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వానొస్తే కాలువలా..



నడిగూడెం బస్టాండ్ సమీపంలో సీసీరోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌కు సమీపంలో గ్రామంలోకి వెళ్లే సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. రోడ్డు వెంట డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం పడితే రోడ్డుపై అడుగు లోతులో నీరు నిలిచి రోడ్డంతా కాలువను తలపిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధిలో నీరు నిలవడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.